సాక్షి
కాకినాడ
శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



అపురూపమమ్మ

సిరుల తల్లీ రావమ్మా.. శుభములొసగు మాయమ్మ అంటూ ఆ దుర్గాదేవిని భక్తజనం కొలిచింది.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శరన్నవ రాత్ర ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది.


8లో



చాకులతో నలుగురిపై దాడి

బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి దారి ఇవ్వలేదన్న కోపంతో చాకులతో నలుగురిపై దాడికి పాల్పడిన ఘటన నిడదవోలు పట్టణ శివారు లింగంపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది.

2.28 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 2,28,353 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 12,700 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

కిక్కిరిసిన రత్నగిరి



సత్యదేవుని దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

అన్నవరం: దసరా వేడుకల తొలి రోజు గురువారం రత్నగిరి సత్యదేవుని ఆలయం భక్తులతో కిటకిట లాడింది. విద్యాసంస్థలకు దసరా సెలవులు ప్రారంభమవడంతో పెద్ద సంఖ్యలో భక్తులు సత్యదేవుని ఆలయానికి విచ్చేశారు. దూర ప్రాంతాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి విచ్చేసి వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామిని దర్శించారని అధికారులు తెలిపారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. గురువారం స్వామివారి వ్రతాలు వేయి జరుగగా అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

నేడు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

కాకినాడ సిటీ: వన్యప్రాణి 70వ వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లాలోని పాఠశాల, కళాశాలల విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన పెంపొందించేందుకు శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా అటవీశాఖాధికారిణి ఎస్.భరణి గురువారం తెలిపారు. కాకినాడ వివేకానంద పార్కు బ్రాంచ్ లైబ్రరీలో వన్యప్రాణుల సంరక్షణ, మానవులతో పాటు స్వేచ్ఛగా వాటి ఆవాసానికి అవసరమైన చర్యలు అనే అంశంపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో 4వ తరగతి నుంచి 10వ తరగతి స్కూలు విద్యార్థులు, ఇంటర్ నుంచి డిగ్రీ వరకూ చదివే ఆసక్తి గల కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి అవసరమైన డ్రాయింగ్ షీట్స్, పేపర్లు సమకూరుస్తామన్నారు. మరిన్ని వివరాలకు కేసరి శ్రీనివాసరావు, నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్, కాకినాడ జిల్లా ఆర్గనైజర్, సెల్ 99127 03697 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

రోడ్డు విస్తరణ అభ్యంతరాలు పరిష్కరించాలి



జాతీయ రహదారి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: జాతీయ రహదారి 216 విస్తరణకు సంబంధించి పాశర్లపూడి, మామిడికుదురులలో ఉన్న అభ్యంతరాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. గురువారం అమలాపురం కలెక్టరేట్‌లో జాతీయ రహదారి విస్తరణ అంశంలో పెండింగ్ సమస్యలు, అభ్యంతరాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు రోడ్డు విస్తరణ పనులకు అడ్డంకిగా ఉన్న నిర్మాణాల విలువ, తదితర అంశాలను పునః పరిశీలించి తాజాగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. గెద్దాడలో రహదారి విస్తరణ పనులకు సంబంధించి బరియల్ గ్రౌండ్ స్థానే వేరే స్థలాన్ని కేటాయించి బరియల్ గ్రౌండ్ నిర్మించాలని ఆదేశించారు. శివకోడులో చాంబర్ రోడ్డు నిర్మాణంతో జల వనరుల శాఖ లాకు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని, వీటిని మరోసారి స్వయంగా పరిశీలిస్తామని అన్నారు. ఈ నెల 5న ఆర్అండ్‌బీ కార్యదర్శి సమావేశానికి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్డీఓ కె.మాధవి, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, జల వనరుల శాఖ ఈఈ బి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీలను గురువారం లెక్కించగా, రూ.1,08,89,635 ఆదాయం వచ్చిందని దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం చక్రధరరావు తెలిపారు. 35 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.90,26,494, అన్న ప్రసాదం హుండీల ద్వారా రూ.18,63,141 వచ్చిందన్నారు. బంగారం 19 గ్రాములు, వెండి 735 వచ్చిందని వివరించారు. శ్రీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి హుండీలను లెక్కించగా, రూ.2,36,510 ఆదాయం సమకూరిందన్నారు. రాజమహేంద్రవరం తనిఖీ అధికారి ప్రసాద్, రాజోలు గ్రూప్ టెంపుల్స్ ఈఓ ప్రసాద్‌రాజు పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు.

కాకినాడ మెయిన్ లైన్ కలేనా?

- ఆరు దశాబ్దాలుగా ఆచరణకు నోచుకోని డిమాండ్
- ప్రయాణికుల అవస్థలకు హాల్ట్ ఎప్పుడో!
- నేడు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ జోనల్ సమావేశం



సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాకినాడను ప్రధాన రైలు మార్గంలో చేర్చాలన్న ఈ ప్రాంత వాసుల చిరకాల వాంఛ కలగానే మిగిలిపోతోంది. ఒకప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగా ఉన్న కాకినాడలో ఇక్కడి రేవు కార్యకలాపాలు, ఎన్ఎఫ్‌సీఎల్ వంటి అనేక పారిశ్రామిక సంస్థల ఏర్పాటు నేపథ్యంలో కాకినాడ రవాణాపరంగా కూడా కీలకంగా మారింది. ఫలితంగా కాకినాడ పోర్ట్ రైల్వేస్టేషన్ నుంచి జరిగే ఎగుమతుల ద్వారా వందల కోట్ల ఆదాయంతో దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే స్టేషన్‌గా కాకినాడ పేరు ప్రతిష్టలను సాధించగలిగింది. రవాణాపరంగా ఎంతో పేరు సాధించిన కాకినాడ స్టేషన్ ప్రయాణికుల సౌకర్యాల పరంగా ఆశించిన ప్రగతిని అందుకోలేకపోయింది. కాకినాడను ప్రధాన రైలు మార్గంలో కలపాలన్న డిమాండ్ అలాగే మిగిలిపోయింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కాకినాడ మెయిన్ లైన్ సాధించడంలో సఫలం కాలేకపోతున్నారు. విజయవాడలో శుక్రవారం రైల్వే జోనల్ సమావేశం జరగనుంది. జిల్లాలో అపరిష్కృతంగా పలు సమస్యలు ఉండగా వాటిని ప్రజాప్రతినిధులు ప్రస్తావించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోరాడే నాథుడు లేక..

దాదాపు ఆరు దశాబ్దాలుగా కాకినాడను మెయిన్ లైన్‌లో కలపాలన్న డిమాండ్ ఆచరణకు నోచుకోవడం లేదు. సుమారు 50 ఏళ్ల క్రితమే కాకినాడ రైల్వే ప్రయాణికుల సంఘం పేరుతో ఎస్.ఎస్.కృష్ణాజీ సుదీర్ఘ పోరాటం చేశారు. నిరాహార దీక్ష సైతం చేశారు. జీవించి ఉన్నంత కాలం మెయిన్ లైన్ కోసం ఎడతెగని పోరాటం చేశారు. సినీనటుడు యు.వి.కృష్ణంరాజు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన సమయంలో కంటి తుడుపుగా ప్రధాన రైలు మార్గం సర్వే కోసం మొక్కుబడిగా నిధులు కేటాయించారు. ఆ తరువాత కేంద్ర రైల్వే బడ్జెట్ సమయంలో మినహా మిగిలిన సమయాల్లో పోరాడే నాథుడే లేకపోయారు. వాస్తవానికి కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి సుమారు తొమ్మిది రైళ్లు దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళుతుంటాయి. వీటిలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు వెళ్లే గౌతమి, సర్కార్, శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లు నిత్యం కాకినాడ నుంచి నడుపుతున్నారు. ఇక ప్రతి గురువారం భావనగర్, బుధ, శనివారాల్లో ముంబై వెళ్లే లోకమాన్య తిలక్, షిరిడి వెళ్లేందుకు సోమ, బుధ, శనివారం ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు విశాఖ, విజయవాడకు ఫాస్ట్ పాసింజర్లను (ప్రస్తుతం వీటిని ఎక్స్‌ప్రెస్ రైలుగా అప్‌గ్రేడ్ చేశారు) కూడా రోజు నడుపుతున్నారు. సుమారు నాలుగువేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి రోజూ రాకపోకలు సాగిస్తుంటారని అంచనా. సామర్లకోట జంక్షన్ కావడంతో ఢిల్లీ, కోల్‌కతాతో పాటు అనేక ముఖ్య ప్రాంతాలకు వెళ్లే రైళ్లు అన్నీ కాకినాడకు సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని సామర్లకోటలో మాత్రమే నిలుపుదల చేస్తున్నారు. ఆ రైళ్లు కాకినాడకు రాకపోవడంతో వందలాది మంది కాకినాడ నుంచి అనేక ఇబ్బందులు పడి సామర్లకోట వెళ్లి రైలు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. పెరిగిన ప్రయాణికుల అవసరాల నేపథ్యంలో పూర్తిస్థాయిలో రైళ్లు లేక హైదరాబాద్, చెన్నై, తిరుపతి, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లేందుకు బస్సులనే ఆశ్రయించాల్సి వస్తుంది. ఆ మేరకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు కూడా గణనీయంగా పెరిగాయి. వీటి ద్వారా సుమారు రోజుకి 800 నుంచి 1,000 మంది ప్రయాణిస్తారని అంచనా.

కోస్తా రైలు మార్గంతో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి

కోస్తా రైలు మార్గంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించే అవకాశం ఉంది. దేశానికి ధాన్యాగారంగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా తీరంలో వ్యవసాయ, పారిశ్రామిక, నౌకా వాణిజ్యం, గ్యాస్, పెట్రోలియం, సముద్ర, జల ఉత్పత్తుల కేంద్రంగా ఉన్న గోదావరి కృష్ణా పరివాహక ప్రాంతాన్ని కలుపుతూ కోస్తా రైలు మార్గాన్ని నిర్మించాలని దశాబ్ద కాలంగా కోకనాడ టౌన్ ప్రయాణికుల సంఘం డిమాండ్ చేస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే అత్యంత ముఖ్యమైన నౌకా వాణిజ్య కేంద్రాలయిన కాకినాడ పోర్టు, నూతనంగా జీఎంఆర్, అరబిందో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ పోర్టు, మచిలీపట్నం పోర్టు, నిజాంపట్నం పోర్టులను కలిపే రైలుమార్గం ఏర్పడుతుంది. చెన్నై–విశాఖపట్నం ప్రధాన రైలు మార్గానికి ప్రత్యామ్నాయ రైలు మార్గం ఏర్పడటంతో పాటు సుమారు 40 నుంచి 50 కిలోమీటర్ల దూరం తగ్గే అవకాశం ఉంది.

మంజూరు చేసిన పనులు పూర్తి చేయాలి



కాకినాడ పార్లమెంటు నియోజకవర్గంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైల్వే శాఖ ద్వారా మంజూరు చేయించిన పనులు పూర్తి చేయాలి. ఇప్పటికే కాకినాడ పిఠాపురం, గొల్లప్రోలు, దుర్గాడ, అన్నవరం స్టేషన్లలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. పిఠాపురం ఉప్పాడ జంక్షన్ ఆర్ఓబీ నిర్మాణానికి రైల్వే శాఖ నుంచి రూ.45 కోట్లు మంజూరు చేశారు. గోర్స, మాధవపురం, తుని, హంసవరం రైల్వే గేట్లు వద్ద ఆర్ఓబీల నిర్మాణం కోసం రూ.17 కోట్లు మంజూరు చేశారు. అనకాపల్లి తుని స్టేషన్‌లో నేషనల్ గ్రీన్ కోర్ ట్రిబ్యునల్ గైడ్ లైన్స్–ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు అనుగుణంగా మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి రూ.1.19 కోట్లు మంజూరు చేశారు. కాని పనులు ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన అన్ని పనులు వెంటనే పూర్తి చేయాలి.

– వంగా గీత, మాజీ ఎంపీ, కాకినాడ

పిఠాపురంలో ప్రధాన రైళ్లకు హాల్టు ఇవ్వాలి



పిఠాపురం రైల్వే ప్రయాణికులకు ఊరట కలిగించే విధంగా పిఠాపురం రైల్వే స్టేషన్‌లో రత్నాచల్, ప్రశాంతి, జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు ఇవ్వాలి. పిఠాపురం రైల్వే స్టేషన్‌లో లిఫ్టు సౌకర్యం కల్పించాలి.పిఠాపురం, కాకినాడ రైల్వే స్టేషన్లలో మౌలిక సదుపాయాల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– రావుల మాధవరావు, జెడ్ఆర్‌యూసీసీ మెంబర్, పిఠాపురం

కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి



ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కోస్తా రైలు మార్గం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. ఉభయగోదావరి, కృష్ణా గుంటూరు జిల్లాల ప్రజలకు కోస్తా రైలు మార్గం ఎంతో ప్రయోజనకరం. ఈ దిశగా కూటమి ప్రభుత్వంలోని రాజకీయ పక్షాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– వైడీ రామారావు, అధ్యక్షుడు, కోకనాడ ప్రయాణికుల సంఘం

అయోధ్య రాముని ధనస్సుకు పూజలు



వెండి ధనస్సు, దాత శ్రీనివాసశాస్త్రికి రత్నగిరిపై స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అన్నవరం: అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామాలయంలో గల శ్రీరామునికి హైదరాబాద్‌కు చెందిన భాగ్యనగర్ సీతారామ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు చల్లా శ్రీనివాస శాస్త్రి కేజీ బంగారం, 14 కేజీల వెండితో తయారు చేయించిన ధనస్సును గురువారం సత్యదేవుని చెంత ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రి దాత తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ ధనస్సును మోసుకుంటూ ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఆలయం వద్ద వారికి అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పండితులు ఆ ధనస్సుకు హారతి ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సత్యదేవుని వద్ద ఉంచి పూజలు చేశారు. తరువాత వేద పండితులు దాతకు వేదాశీస్సులు అందచేసి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. రత్నగిరి క్షేత్రపాలకులు సీతారాముల ఆలయం వద్ద కూడా ఈ ధనస్సుకు పూజలు చేశారు. దాత శ్రీనివాస శాస్త్రి మాట్లాడుతూ శ్రీరాముడు 14 సంవత్సరాలు వనవాసం చేసినందుకు గుర్తుగా 14 కిలోల వెండి తో ధనస్సు చేయించినట్లు తెలిపారు.

జాతీయ సీబీఎస్ఈ తైక్వాండో పోటీలకు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉత్తరాఖండ్‌లో ఈ నెల 9నుంచి 13 వరకు జరిగే సీబీఎస్ఈ జాతీయ తైక్వాండో పోటీలకు కాకినాడ డీఎస్‌పి క్రీడాకారులు ఎంపికయ్యారని డీఎస్‌పి తైక్వాండో కోచ్ తరుణ్ గురువారం తెలిపారు. అండర్–19 విభాగంలో ఎస్‌కే యూసఫ్‌మస్తాన్ వలీ, పి.స్వేచ్ఛ నిహారిక, కె.హరిణి ఎంపికై న వారిలో ఉన్నారన్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీని కోచ్, క్రీడాకారులు మర్యాద పూర్వకంగా కలువగా, కోచ్ తరుణ్‌ను ఎమ్మెల్యే దుశ్శాలువాతో సత్కరించారు.

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

మూడో రోజు నిరసన దీక్షల్లో రైతు సంఘాలు



మూడో రోజు దీక్షను కొనసాగిస్తున్న ఆందోళనకారులు

కాకినాడ సిటీ: విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు మూడు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరసన దీక్షల ఫలితంగా, ఉక్కు కార్మికులు చేస్తున్న పోరాటం పాక్షిక విజయం సాధించిందని ఆందోళనకారులు వివరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక పిలుపు మేరకు రైతు సంఘాలు, మహిళా సంఘాలు చేస్తున్న నిరసన దీక్షలు మూడో రోజుకు చేరాయి. ఈ దీక్షలను గురువారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మోర్తా రాజశేఖర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పప్పు ఆదినారాయణ, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వరలక్ష్మి మాట్లాడుతూ బుధవారం విశాఖ ఉక్కు కార్మిక సంఘాలతో ఉక్కు యాజమాన్యానికి జరిగిన చర్చల సందర్భంగా తొలగించిన 4 వేల మందిని బేషరతుగా విధుల్లోకి తీసుకుంటున్నట్లు రాతపూర్వకంగా ప్రకటించారన్నారు. ఇది రాష్ట్ర ప్రజల విజయమని కొనియాడారు. 32 మంది విద్యార్థుల ప్రాణ త్యాగాలలో, 32 వేల ఎకరాల రైతుల భూమి త్యాగాలలో, 67 మంది ఎంపీల రాజీనామాలలో చంద్రబాబుకి రాష్ట్ర ప్రజల సెంటిమెంటు కనబడటం లేదా అని ప్రశ్నించారు. దేశ ప్రజల సంపదను కార్పొరేట్ల పరం చేయడంలో ప్రధాని మోదీకి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కూడా సహకరిస్తూ కూటమిపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ సంఘాల నాయకులు కేఎస్ శ్రీనివాస్, అప్పారెడ్డి, గుర్రాల వెంకటసబ్బిరెడ్డి, వి.చంద్రరావు, ఉప్పాడ సత్యనారాయణ, ఎస్.గంగా భవాని, భూ లక్ష్మ, మలకా రమణ, చంద్రమళ్ల పద్మ, మడికి సత్యం, కె సింహాచలం, మానుకొండ లచ్చబాబు, జనార్దన్, కేశవరావు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రత్నగిరిపై దసరా సందడి ఆరంభం

- తొలిరోజు బాలా త్రిపురసుందరిగా దర్శనమిచ్చిన వనదుర్గ, కనకదుర్గ
- సర్వాంగ సుందరంగా దుర్గాలయాల ముస్తాబు



శరన్నవరాత్రుల సందర్భంగా అనివేటి మంటపంలో కలశ స్థాపన పూజలు నిర్వహిస్తున్న పండితులు. పాల్గొన్న ఆలయ చైర్మన్ రోహిత్

అన్నవరం: రత్నగిరి శ్రీసత్యదేవుని సన్నిధిన శరన్నవరాత్ర వేడుకలు (దసరా ఉత్సవాలు) ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవుని ఆలయంలో పండితులు కలశ స్థాపన చేసి దసరా వేడుకలకు అంకురార్పణ చేశారు. అంతకుముందు అనివేటి మంటపంలో స్వామి, అమ్మవార్లకు పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దసరా తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు, తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించే 44 మంది రుత్విక్కులు, 16 మంది అర్చకస్వాములకు చైర్మన్ ఐవీ రోహిత్ దీక్షా వస్త్రాలు అందజేశారు. అనంతరం రత్నగిరి దర్బారు మంటపంలో కలశ స్థాపన, రుత్విక్ వరుణలు, మంటపారాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ రుత్విక్కులు శ్రీ సూక్త, పురుషసూక్త, మన్యుసూక్త పారాయణలు, లలితా, విష్ణు సహస్ర నామావళి పారాయణ చేశారు. లింగార్చన, నవావరణ అర్చన, సూర్యనమస్కారాలు నిర్వహించారు. బాల, సువాసిని పూజలు నిర్వహించారు. యంత్రాలయంలోని శ్రీమహా వైకుంఠ నారాయణ విభూతి యంత్రానికి రుత్విక్కులు పూజలు చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి సత్యదేవుని ప్రధానాలయంతో బాటు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్ల ఆలయాలలో రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాల నివేదన చేశారు.

తొలిరోజు బాలా త్రిపుర సుందరి అవతారంలో దుర్గామాతలు

దసరా మొదటి రోజు గురువారం వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను బాలాత్రిపురసుందరి అవతారంలో అలంకరించి పూజించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా వనదుర్గ, కనక దుర్గ ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు.

ఐదేళ్లలో అదిరిపోవాలి

- విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేయండి
- కలెక్టర్ షణ్మోహన్
- కార్యాచరణ రూపకల్పనపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: స్వర్ణాంధ్ర–2047 విజన్ కింద రానున్న ఐదేళ్లలో వివిధ రంగాలలో కాకినాడ జిల్లాలో 155 శాతం మించి స్థూల ఉత్పాదన సాధన లక్ష్యంగా జిల్లా విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశపు హాలులో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలకనుగుణంగా కాకినాడ జిల్లా రానున్న 2024–29 ఐదేళ్ల కాలంలో వివిధ గ్రోత్ సెక్టార్లలో చేపట్టవలసిన అంశాలతో జిల్లా కార్యాచరణ రూపకల్పనపై కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధ్యక్షతన ప్రత్యేక మేధోమధన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆ రంగాల స్టేక్ హోల్డర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కలెక్టర్ షణ్మోహన్ ప్రారంభిస్తూ 2047 సంవత్సరం నాటికి ప్రజల తలసరి ఆదాయం 45 వేల డాలర్లతో 15 శాతం గ్రోత్ రేటుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాన్ని చేపట్టిందన్నారు. ఈ లక్ష్య సాధనలో కాకినాడ జిల్లా కీలక భాగస్వామ్యం వహించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా రంగాల భాగస్వామ్య వర్గాలు సమష్టిగా కృషి చేయాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో స్థూల ఉత్పత్తిని పెంచేందుకు దోహదం అవుతున్న 14 ప్రభుత్వ శాఖల ద్వారా రానున్న 2024–29 ఐదేళ్ల కాలంలో అభివృద్ధి సామర్థ్యాలను గరిష్ట స్థాయిలో సద్వినియోగంలోకి తెచ్చేవిధంగా లక్ష్యాలను నిర్దేశించుకుంటూ విజన్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను కోరారు. ప్రధానంగా వ్యవసాయం, ఉద్యానవనాలు, మైక్రో ఇరిగేషన్, పశుసంవర్థక, మత్స్య, పరిశ్రమలు, ఏపీఐఐసీ, విద్య, వైద్యం, స్కిల్ డెవలప్‌మెంట్, మున్సిపల్ పరిపాలన, పర్యాటకం, జలవనరుల శాఖలు లక్ష్యాలను ఈ ప్రగతి కార్యాచరణలో పొందుపరచాలని ఆదేశించారు. శాఖల వారీగా ప్రణాళికాబద్ధంగా చేరుకోవాల్సిన లక్ష్యాలపై ఆయా శాఖలతో ఆయన సమీక్షించారు.

రైతు ఆదాయం పెంచే చర్యలు

వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖల సమీక్షలో సాగు విస్తీర్ణాలను పెంచి, యాంత్రీకరణ, పెట్టుబడి తగ్గించి రైతు ఆదాయం పెంపుదలకు, ఏటా మూడు పంటల సాగును ప్రోత్సహించడం వంటి అంశాలను విజన్ డాక్యుమెంట్‌లో చేర్చేందుకు నిర్ణయించారు. పశుసంవర్ధకశాఖ సమీక్షలో స్థూల ఉత్పత్తిలో 3 శాతంగా ఉన్న పాలు, గుడ్లు, మాంసం ఉత్పాదకతను 8 శాతం మేరకు పెంచాలని, ఎఫ్‌పీఓల ఏర్పాటు, మేలుజాతి పశువుల పెంపకం అంశాలను చర్చించారు. మత్స్యశాఖ సమీక్షలో మెరైన్, ఇన్‌లాండ్, ఆక్వా రంగాల ప్రగతికి అవసరమైన మౌలిక సదుపాయాల విస్తరణ, డీప్ సీ ఫిషింగ్, మత్స్య ఉత్పతుల ఎగుమతుల పెంపుదల అంశాలను చర్చించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సమీక్షలో యువతకు విస్తృత ఉపాధి అవకాశాలను కల్పించే అంశాలలో శిక్షణ కార్యక్రమాలు, ప్రతినెలా రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించాలని నిర్ణయించారు. మున్సిపల్ పరిపాలన సమీక్షలో కాకినాడ నగరంలో కొత్తగా 20 కిలోమీటర్ల పొడవునా రోడ్లు, 52 కిలోమీటర్ల పొడవునా డ్రెయిన్ల విస్తరణ చేపట్టాలని, తలసరి తాగునీటి సరఫరా పెంచాలని లక్ష్యాలుగా నిర్ణయించారు. పీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కంపెనీలు, పరిశ్రమలు కోరుకునే నైపుణ్యాల్లో యువతకు శిక్షణ కల్పించడం ద్వారా వారికి మెరుగైన ఉపాధి కల్పించాలని సూచించారు. కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, డీఎఫ్ఓ భరణి, అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, సీపీవో త్రినాథ్, వ్యవసాయశాఖ జేడీ ఎస్.విజయకుమార్, ఉద్యాన శాఖ డీడీ జీవీవీడి ప్రసాదరావు, పశుసంవర్ధకశాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు, టూరిజం అధికారి పి.పోశయ్య పాల్గొన్నారు.

ఘనంగా మహాశక్తి యాగం

- రమణయ్యపేట శ్రీపీఠంలో దసరా సందడి ఆరంభం
- తొలి రోజు దీక్ష వస్త్రాలతో కుంకుమార్చనలో పాల్గొన్న 26వేల మంది మహిళలు



భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న పరిపూర్ణానంద స్వామిజీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట శ్రీపీఠంలో మహాశక్తి యాగం ఘనంగా సాగింది. పీఠంలో దసరా పూజా కార్యక్రమాలను గురువారం పరిపూర్ణానంద స్వామి ప్రారంభించారు. నవరాత్రుల్లో భాగంగా ప్రతి రోజూ ఇక్కడ భారీ ఎత్తున కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. తొలి రోజే సుమారు 26వేల మంది మహిళలు దీక్షా వస్త్రాలు ధరించి పూజకు హాజరయ్యారు. తొమ్మిది గంటల నుంచి భక్తుల సందడి ప్రారంభయ్యింది. లలితా సహస్ర నామాలతో కుంకుమార్చనలు నిర్వహించేందుకు మహిళాభక్తులకు రెండు భారీ షెడ్లను ఏర్పాటు చేయడంతో వాటిలో కూర్చున్నారు. తొలుత స్వామిజీ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ నెల 13వరకు శ్రీపీఠంలో దసరా పూజా కార్యక్రమాలు జరుగుతాయని, వేలాదిగా వచ్చే భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశామన్నారు. మూలా నక్షత్రం రోజు విద్యార్థులకు సరస్వతీ పూజ, అష్టమి నాడు అమ్మవారికి వేలాది మంది భక్తులతో కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. లలితా అమ్మవారి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని దేశం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ పూజలు నిర్వహిస్తున్నామన్నారు. పది రోజుల పాటు వంద కోట్ల కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. తొలి రోజు సాయంత్రం అన్నపూర్ణ దేవి అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అన్న సూక్త, అన్నపూర్ణ హోమాలను వేద పండితులు నిర్వహించారు.



దీక్షా వస్త్రాలు ధరించి.. శ్రీపీఠంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

క్లుప్తంగా

డీజిల్ తరలిస్తున్న వ్యాన్ సీజ్


సీజ్ చేసిన వ్యాన్ వద్ద అధికారులు, కోరంగి పోలీసులు

తాళ్లరేవు: యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా డీజిల్ తరలిస్తున్న వ్యాన్‌ను కోరంగి పోలీసులు గురువారం సీజ్ చేశారు. ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. ముందుగా అందిన సమాచారం మేరకు ఎంఎస్‌ఓ లక్ష్మీ ప్రసన్న వీఆర్వోలతో కలిసి కోరంగి పోలీస్ స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. యానాంలోని ఒక పెట్రోల్ బంకు నుంచి 2400 లీటర్ల డీజిల్‌ను కొనుగోలు చేసి జగ్గంపేట తరలిస్తుండగా వ్యాన్ సీజ్ చేశారు. యానాంలో లీటర్ డీజిల్ రూ.84.79కు కొనుగోలు చేసి, ఆంధ్రాలో రూ.97కు పైగా విక్రయిస్తున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడిలో తాళ్లరేవు, కోరంగి, పటవల వీఆర్వోలు సమనాసి వీరబాబు, ఎల్.శ్రీను, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదరించే వారులేక ఆత్మహత్యాయత్నం


స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు రాంబాబుకు నాగరత్నాన్ని అప్పగిస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: జీవిత చరమాంకంలో ఒంటరి జీవులకు ఆలనా పాలనా చూసేవారు లేకపోవడంతో చివరికి చావుకు దగ్గర కావాలని కోరుకుంటూ బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన తుమ్మిడి నాగరత్నం (75)ను అనారోగ్యం ఒక వైపు, అయినవారు చూడకపోవడం మరో వైపు కుంగదీసింది. కుటుంబ సభ్యుల ఈసడింపులను తట్టుకోలేని ఆమె గురువారం ఉదయం రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. అక్కడ చిరు వ్యాపారులు ఆమెను నిలువరించి మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదృష్టవశాత్తు ఆమె బతికి బయటపడింది. పోలీసులు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు రాంబాబుతో మాట్లాడి ఆమె దుస్థితిని వివరించి ఆశ్రమంలో చేర్పించారు. ఇక్కడ తనలాంటి పది మందిని చూసి, బతకాలని ఆశ కలిగిందని నాగరత్నం తెలిపారు.

బంధువులు వస్తే అప్పగిస్తాం

స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో సుమారు 30 మందికి ఆశ్రయం కల్పిస్తుండగా, రోజూ రెండు పూటలా కలిపి 300 భోజనాలు అల్పాహారం, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని నిర్వాహకుడు గుబ్బల రాంబాబు తెలిపారు. అలాగే పుష్కరాల రేవులోనూ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోజూ 500 మందికి మొబైల్ ఉచిత అన్నదాన సేవలను అందిస్తున్నామన్నారు. నాగరత్నం బంధువులు, సంబంధించిన వారు ఎవరు వచ్చినా పోలీసులు ద్వారా వారికి తిరిగి అప్పగిస్తామని అన్నారు.

వాహనం సీజ్

తుని రూరల్: మాంసపు వ్యర్థాల లోడు వాహనాన్ని ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సీజ్ చేసినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి తెలిపారు. గురువారం విశాఖపట్నం నుంచి కాకినాడ జిల్లా ఇత్రిపాకకు వెళుతున్న వ్యర్థాల లోడు వాహనాన్ని ఎఫ్‌డీఓ సీజ్ చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.


రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అమ్మవారు


కాకినాడ దేవాలయం వీధిలో గాయత్రీ దేవిగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు


పిఠాపురం పాదగయలో రాజరాజేశ్వరీదేవి అమ్మవారు


స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా అమలాపురం శ్రీదేవి అమ్మవారు


రాజరాజేశ్వరి అవతారంలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

అపురూపమమ్మ

- ఉమ్మడి జిల్లాలో దసరా ఉత్సవాలకు శ్రీకారం
- తొలిరోజు వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు

సిరుల తల్లీ రావమ్మా.. శుభములొసగు మాయమ్మ అంటూ ఆ దుర్గాదేవిని భక్తజనం కొలిచింది.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్ర ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. తొలిరోజు అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాడవాడలా అమ్మవారి మంటపాలను ఏర్పాటు చేయగా, ప్రముఖ దేవాలయాల వద్ద ఉత్సవాలు అంబరాన్నంటాయి. రాజమహేంద్రవరం, కాకినాడ, అన్నవరం, తలుపులమ్మ లోవ, అమలాపురం తదితర చోట్ల ప్రముఖ ఆలయాలతో పాటు వివిధ ఉత్సవ మంటపాల్లో వేడుకలు జరిగాయి.


అన్నవరంలో బాలాత్రిపుర సుందరిగా కనకదుర్గమ్మ


బాలాత్రిపుర సుందరిగా లోవ తలుపులమ్మ తల్లి


బాలాత్రిపుర సుందరిగా అన్నవరం వనదుర్గమ్మ


కాకినాడ రమణయ్యపేట శ్రీపీఠంలో అన్నపూర్ణ అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరిదేవిగా అమ్మవారు


రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో విద్యుత్ దీపాలంకరణ


అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో విశేష అలంకరణలో అన్నపూర్ణాదేవి


రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో కిక్కిరిసిన భక్తులు


కోటనందూరు మండలం కాకరాపల్లిలో కలశయాత్ర చేస్తున్న మహిళలు

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు పీఆర్ విద్యార్థినులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అండర్-14, 17 హాకీ ఎంపికల్లో పీఆర్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారని హెచ్‌ఎం కేవీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈ ఎంపికల్లో రాష్ట్ర స్థాయికి 10వ తరగతి విద్యార్థిని పి.సాయిలక్ష్మి, 8వ తరగతి విద్యార్థిని ఎస్.మానస ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులను, పీడీ సయ్యద్ మస్తానీ బేగంను ఆయన అభినందించారు. త్వరలో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

విద్యలోనూ ప్రతిభ

సాలిపేట బాలికోన్నత పాఠశాలలో జరిగిన స్వచ్ఛతా హి సేవా అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఆ పాఠశాలకు చెందిన వి.నవ్యసుష్మశ్రీ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిందని పీడీ బేగం తెలిపారు. గాంధీనగర్ మున్సిపల్ స్కూల్‌లో జరిగిన సేవ్ ద గర్ల్ చైల్డ్ అంశంపై నిర్వహించిన చిత్రలేఖనంలో 10వ తరగతి విద్యార్థిని బి.దాలిసత్యహేమ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిందన్నారు. విజేతలను హెచ్‌ఎం సత్యనారాయణ, జిల్లా డీసీఈబీ కార్యదర్శి వెంకటరావు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, మరో విద్యార్థినిని శిక్షించిన ఫిర్యాదుల మేరకు హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) మోసుగంటి వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు గదులు తుడవడానికి వస్తే చాక్లెట్లు ఇస్తానని చెప్పడంతో విద్యార్థినులు వెళ్లి తుడిచారు. అనంతరం విద్యార్థినులు సదరు మాస్టర్‌ను చాక్లెట్‌లు అడిగితే అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు మరో విద్యార్థినిని శిక్షించాడని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం డీవైఈఓ నారాయణ, జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు తప్పు చేసినట్లు తేలింది. దీంతో కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు అతన్ని సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావుపై ఎటువంటి పోలీసు కేసు నమోదు కాకుండా పిడింగొయ్యికి చెందిన ఓ టీడీపీ నేత మధ్యవర్తిత్వం చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

రేషన్ బియ్యం నిల్వలపై విజిలెన్స్ దాడి

రూ.5.46 లక్షల విలువైన బియ్యం పట్టివేత


అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో ఉన్న టాటా ఏస్ వాహనం, నిందితులు

రాయవరం: మండలంలోని పసలపూడిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మండల సివిల్ సప్లయిస్ డీటీ ఆలీషా కథనం ప్రకారం.. పసలపూడిలో జి.వెంకన్న అనే వ్యక్తి షెడ్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన రేషన్ బియ్యం నిల్వ ఉంచారన్న సమాచారంపై రెవెన్యూ అధికారులతో కలసి విజిలెన్స్ అధికారులు టి.నాగవెంకటరాజు, కె.విజయకుమార్, సీహెచ్ కిశోర్‌కుమార్ తనిఖీ చేశారు. ఇక్కడ షెడ్‌లో ఉంచిన టాటా ఏస్ వాహనంలో 65 బ్యాగుల్లో నిల్వ ఉంచిన సుమారు 3,185 కిలోల రేషన్ బియ్యాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని రామచంద్రపురం పట్టణానికి చెందిన నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, గుమాస్తా రావాడ వీరబాబు సహాయంతో వివిధ ప్రాంతాల్లోని వ్యక్తుల నుంచి కిలో రూ.20కు కొనుగోలు చేసి కిలో రూ.23కు జి.మామిడాడ పరిసర ప్రాంతాల్లోని చేపల చెరువులకు అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం విలువ రూ.5,46,419 ఉంటుందని అన్నారు. రేషన్ బియ్యంతో పాటుగా వేయింగ్ మెషీన్‌ను పౌర సరఫరాల అధికారులు సీజ్ చేసి, 6-ఏ కింద కేసు నమోదు చేశారు. బియ్యాన్ని నిల్వ చేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసుల నమోదుకు పౌర సరఫరాల డీటీ ఆలీషా రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

కాకినాడ సిటీ: జిల్లాలో ఖరీఫ్ 2024 ధాన్యం సేకరణకు యంత్రాంగం సిద్ధం కావాలని జేసీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి ధాన్యం కొనుగోలు సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ లోపు గోనె సంచులను మిల్లర్ల వద్ద నుంచి రైతు సేవా కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.

చాకులతో నలుగురిపై దాడి

- ఒకరి పరిస్థితి విషమం
- నిడదవోలు శివారు లింగంపల్లిలో ఘటన


నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కాకర్ల శ్రీను

నిడదవోలు రూరల్/ నిడదవోలు: బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి దారి ఇవ్వలేదన్న కోపంతో చాకులతో నలుగురిపై దాడికి పాల్పడిన ఘటన నిడదవోలు పట్టణ శివారు లింగంపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకుని లింగంపల్లిలో అమ్మవారి మండపాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ భవానీ మాల ధరించిన భక్తులు భజనలు, చిన్నారులు కోలాటం చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన గంటు సునీల్ బైక్‌పై ఇంటికి వెళ్లేందుకు అటువైపు వచ్చాడు. తన బైక్ వెళ్లేందుకు దారి ఇవ్వాలని సునీల్ కమిటీ సభ్యులను అడిగే సమయంలో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. దీంతో సునీల్‌తో పాటు అతని తమ్ముడు అనిల్ కలసి చాకులతో వచ్చి కమిటీ సభ్యుడైన కాకర్ల శ్రీను, అతని కుటుంబ సభ్యులు కాకర్ల పుట్టయ్య, కాకర్ల ప్రవీణ్, మీసాల శ్రీనులపై దాడి చేశాడు. దీంతో మెడ వద్ద తీవ్ర గాయాలైన కాకర్ల శ్రీనును రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి అత్యవసర వైద్య సేవల నిమిత్తం తరలించారు. గాయాలైన ప్రవీణ్, పుట్టయ్య, మీసాల శ్రీనులకు నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఘటనా స్థలాన్ని సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్సై టి.శోభన్‌కుమార్‌లు పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

పేకాట శిబిరంపై దాడి

కాకినాడ క్రైం: నగరంలోని రామారావు పేటలో పేకాట శిబిరంపై స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసి జూదరులను అరెస్ట్ చేశారు. ఇందులో ప్రముఖులు ఉన్నట్లు సమాచారం. ఎస్పీ విక్రాంత్ ఆదేశాల మేరకు క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రముఖ న్యాయవాదితో సహా టీడీపీకి చెందిన పలువురు చోటా నేతలు దాడుల్లో పట్టుబడినట్లు తెలుస్తోంది. 15 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.20 లక్షల మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతుడు బ్యాంక్ మేనేజర్‌గా గుర్తింపు

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట వైద్యనగర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుడు రాయుడుపాలెం యూనియన్ బ్యాంక్ మేనేజరు రొయ్యి రాంబాబు (36)గా సర్పవరం పోలీసులు గుర్తించారు. వైద్యనగర్‌లో నివసిస్తున్న రాంబాబుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలు స్నాక్స్ కావాలని అడగడంతో ఇంటి నుంచి రమణయ్యపేట మార్కెట్ వద్దకు బుధవారం రాత్రి వెళ్లి వాటిని కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా ఆయనను ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు బలమైన గాయం తగలడం వల్ల తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


సుజాత (ఫైల్)

సఖినేటిపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కేశవదాసుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ సుజాత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఉయ్యూరువారి మెరక గ్రామంలోని వెలంకాయల కోడు కాలువగట్టు ప్రాంతంలో ఆమె నివాసం ఉంటున్నారు. మంగళవారం స్కూల్‌కు వెళ్లే క్రమంలో కేశవదాసుపాలెం వద్ద బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడిపోయారు. దీంతో ఆమె తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు కాకినాడ అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

పిల్లల చదువుల బాధ్యత స్వీకరణ


విద్యార్థుల విద్యా బాధ్యతలు స్వీకరించిన సతీష్, పెదబాబు

కాకినాడ క్రైం: ఇంటి పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబాల్లో పిల్లల చదువులకు అండగా నిలుస్తున్న శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ మరో ముగ్గురు పిల్లల బాధ్యతలు స్వీకరించింది. రామచంద్రపురం నియోజకవర్గం గొల్లపాలేనికి చెందిన చెన్నకేశవ మృతి చెందగా అతని కుమారుడు జశ్వంత్, గుండెపోటుతో ఈశ్వరరావు మృతి చెందగా అతని కుమార్తె లీలశ్రీ, కుమారుడు సురేష్‌ల చదువు బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు శ్రీయువసేన వ్యవస్థాపకుడు సతీష్ గురువారం ప్రకటించారు. సప్తగిరి హేచరీస్ అధినేత పెదబాబు ఈ ముగ్గురు పిల్లల విద్యకు దాతగా కొనసాగనున్నారన్నారు.